# ఘటన

— గండిసేవ సుందర్రామయ్య

వైశాఖ మాసం కావటం చేత పదకొండు గంటలైనా కాక మునుపే సూర్యుడు తీవ్ర రూపాన్ని దాల్చాడు. ఆయనతో పోటీ పడుతూ, "నాకూ శక్తివుంది సుమా!" అంటూ వాయుదేవుడు విజృంభించాడు. వీరిద్దరి ధాటికి తట్టుకోలేక ప్రజానీకం తల్లడిల్లి పోతూంది. ఎండ తీవ్రంగా వున్నప్పటికీ రోడ్డు మీద మాత్రం రద్దీ తగ్గలేదు. అందుక్కారణం అది విజయవాడ పట్నం కావటమే. వచ్చేపోయే కార్లతోను, లారీలతోను రిక్షాలతోను రోడ్డంతా హడావుడిగా వుంది.

బక్క చిక్కిన శరీరంతో, లోతుకు పోయిన కళ్ళతో, సంస్కారంలేని గడ్డంతో, చిరిగి పోయిన కాకీ టోపీతో, అతుకులు వేసిన పంచెతో చేతుల్లేని చొక్కాతో అప్పటి వరకు పావలా డబ్బులుకూడా సంపాదించ లేని రిక్షా రంగయ్య నిరాశతో బస్సుస్టాండు వైపు రిక్షా పోనిచ్చాడు. బేరాలకోసం ఎదురు చూస్తున్న రంగయ్యకు "ఏయ్! రిక్షా!" అన్న కేక ఆశాకిరణంలా చెవిని పడింది.

"ఎక్కడికి బాబూ?" అని అడిగాడు రంగయ్య ఫుల్ సూట్లో వున్న రఘును చూసి.

"మాచవరం"

"ఎక్కండి బాబూ!" అంటూ అతని చేతిలో వున్న బ్రీఫ్ కేసును తీసుకొని రిక్షాలో పెట్టాడు.

రఘు రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా కదిలింది. జేబులో వున్న కర్చీఫ్ను తీసి ముఖమ్మీద చెమటను తుడుచుకొన్నాడు రఘు. బాగా పొక్కబెట్టడం చేత మెల్లగా గుండీలు విప్పి కోటుతీసి ప్రక్కన పెట్టాడు. రిక్షాలో కూర్చున్నప్పటికీ ఈదురుగాలి విపరీతంగా వీస్తూంది. రోడ్డుమీద గాలిదుమారం లేచి వెచ్చటి ఆవిరి చెవులగుండా దూసుకు పోతూంది. చేతిలోవున్న కర్చీఫ్ను చెవుల కడ్డం పెట్టుకొని రోడ్డుమీదికి చూశాడు రఘు.

రిక్షా గవర్నర్ పేట సెంటర్ కు చేరింది.

రిక్షా రంగయ్యలో ఉత్సాహం సన్నగిల్లింది.

రిక్షా అతి మెల్లగా కదుల్తూంది.

"బండి జోరుగా పోవటంలేదే?" అడిగాడు రఘు.

"తొక్కుతున్నాను బాబూ," అంటూ రంగయ్య శక్తినంతా కూడగట్టుకొని వేగంగా తొక్కటానికి ప్రయత్నించాడు.

రోడ్డుమీదికి చూస్తున్న రఘులో ఆలోచనలు మెదిలాయి.

"తను వస్తున్నట్లు పద్మకు ఉత్తరం కూడా రాయలేదు. అసలు రాసేందుకు వ్యవధి ఎక్కడుంది? అప్రయత్నంగా క్రితం రాత్రి కలలోకి వచ్చింది పద్మ. అప్పట్నుంచి ఆమెను చూడాలని తన మనసు

ఒత్తిడి చేసింది. ఆఫీసులో ఏ ఫైలు తెరిచినా చిలిపిగా నవ్వుతూ తనను నవ్వించే పద్మ ముఖమే కన్పించేది తనకు. పద్మను విడిచి దూరంగా వుండటం అసంభవ మన్పిస్తూంది. కనీసం నెలకోసారైనా ఆమెను చూడనిదే అదోలా వుంటుంది. అందుకనే ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్‌కు అప్లయ్ చేశాడు తను. తనకంటే ముందు అప్లయి చేసినవాళ్ళు ఇంకా కొంతమంది వుండటంచేత తనకు ఇప్పట్లో వచ్చే అవకాశంలేదు. తను వస్తున్నానని ఉత్తరంరాస్తే పద్మ గుమ్మం దగ్గరే నిలబడి తనకోసం ఎదురు చూస్తుంది. ఈసారి తను ఉత్తరం కూడా రాయకుండా హఠాత్తుగా కన్పించేసరికి పద్మ ఆనందంతో ఉక్కిరి బిక్కిరౌతుంది. ఈ మండుటెండల్లో పద్మ ఆరోగ్యం ఎలా వుందో?" రఘు బాహ్య ప్రపంచాన్నే మర్చిపోయి పద్మ గురించే ఆలోచిస్తుండి పోయాడు.

నిమిషాలు గడుస్తున్న కొద్దీ సూర్యుడు ప్రళయ కాలరుద్రునిలా మండసాగాడు. ఎండధాటికి రంగయ్య తట్టుకోలేక పోతున్నాడు.

"పంతంకోసం కాదు ప్రభూ! పట్టెడన్నం కోసమే నీతో పోటీపడుతున్నాం!" అంటూ దీనంగా అర్థిస్తున్నట్లున్నాయి రంగయ్య శరీరం పైనుండి జారుతున్న స్వేద బిందువులు.

రక్తప్రసారమే ఆగిపోయిందా అన్నట్లు కాళ్ళు [illegible] రంగయ్యకు.

కళ్ళకేవో తెరలు అడ్డువచ్చాయి.

చేతులు పట్టుతప్పాయి.

రఘు ఆలోచనలకు ఒక్కసారే అంతరాయం కలిగింది.

[illegible] సడన్‌గా ఆగిపోయింది రిక్షా.

రంగయ్య ముందుకు వాలిపోయాడు.

రఘు గబగబ క్రిందికి దిగాడు. రంగయ్యను అటు ఇటు కదిపి చూశాడు కాని మాట్లాడలేక పోయాడు రంగయ్య. నిస్సత్తువగా, నిర్జీవంగా వున్న రంగయ్యను చూడగానే రఘు మనస్సు ఆర్ద్రమైంది. ధైర్యం తెచ్చుకొని దగ్గర్లోవున్న నర్సింగ్ హోమ్‌కు చేర్చాడు.

డాక్టర్ ఇంజక్షన్ చేసిన కాస్సేపటికి రంగయ్యకు స్పృహవచ్చింది. కొంతకాలం విశ్రాంతి అవసరమన్నాడు డాక్టర్. రంగయ్య దీనస్థితికి రఘు హృదయం కరిగి పోయింది. ఏదో అవ్యక్తమైన గౌరవాభిమానాలు అతని మనస్సులో తలెత్తాయి. రంగయ్యకు మంచి ట్రీట్‌మెంటు యిప్పించి, జాగ్రత్తగా చూడమని డాక్టర్‌కు చెప్పి, అవసరమైతే తనకు కబురు చేయమని పద్మ అడ్రస్ యిచ్చి నర్సింగ్ హోమ్‌లోంచి బయటకు వచ్చాడు రఘు.

వరండాలో కూర్చుని నవల చదువుకొంటున్న పద్మ బూట్ల చప్పుడు విని తలెత్తి చూసింది.

ఎదురుగా రఘు.

ఆమె మనస్సులో ఆనందాశ్చర్యాలు ఒక్కసారే కల్గాయి.

"ఏంటన్నయ్యా! ఉత్తరం కూడా రాయకుండా వచ్చేశావే? వదినవాళ్ళు, పిల్లలు కులాసాగా వున్నారా?" అంటూ కుర్చీలోంచి లేచి రఘుకు ఎదురుగా వెళ్ళింది.

"నిన్న రాత్రి ఓ గమ్మత్తు జరిగింది పద్మా!"

"ఏమైంది?" అని అడిగింది ఎంతో ఆశ్చర్యంగా.

"ఏం చెప్పను పద్మా! నువ్వు హఠాత్తుగా కలలోకి వచ్చి నాకిష్టమైన సేమ్యాపాయసం వండి పెట్టావు. నీ చేత్తో చేసిన పాయసం ఎప్పుడు తిందామా అని

అలవాటుపడుతూ వచ్చేశాను" అన్నాడు రఘు చేతిలో వున్న కోటును కుర్చీమీద వేస్తూ.

"అంతేకాని చెల్లాయి మీదున్న ప్రేమ చేత కాదన్నమాట నువ్వొచ్చింది;" బుంగ మూతి పెడ్తూ అంది పద్మ.

"ఎంత మాటన్నావు పద్మా! నీ మీద కాకపోతే నా కింకెవరిమీద వుంటుందమ్మా యింత ప్రేమా! నాకు తమ్ముడివైనా, చెల్లాయివైనా నువ్వేగా!" చెల్లెలు తలను ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు రఘు.

ఆ మాటలు వినేసరికి పద్మ హృదయం ఆనందంతో పులకరించింది. అన్నగారి మీదున్న అనురాగమంతా ఆమె కళ్ళల్లో తొణికిసలాడింది. తన మీద అన్నగారికున్న మమకారానికి మనస్సులోనే జోహారు అర్పించింది.

"కానీ యివ్వాళ దార్లో విచారకరమైన సంఘటన జరిగిందమ్మా!" అన్నాడు రఘు బాధగా.

"ఏం జరిగిందన్నయ్యా?" ఆత్రంగా అడిగింది పద్మ.

రంగయ్య స్పృహ తప్పి పడిపోయిన సంగతి, తను అతన్ని నర్సింగ్‌హోమ్‌లో చేర్పించి వచ్చిన సంగతి వివరంగా చెప్పాడు.

"దేవుడు మనుష్యులకెప్పుడూ అన్యాయం చేయడన్నయ్యా! లోకంలో అంతా దుర్మార్గులే వుండరు. నీ లాంటి మంచివాళ్ళు కూడా వుంటారు. లేకపోతే రంగయ్యలాంటి నిర్భాగ్యులు బ్రతుకలేరు. సమయానికి దేవునిలా నువ్వు ఆదుకోవటం అతని అదృష్టం. అది సరే కాని వెళ్ళి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కొనిరా. భోజనం వడ్డిస్తా! విషయాలన్నీ తర్వాత తీరిగ్గా మాట్లాడుకొందాం;" అంటూ అన్నయ్య చేతిలోని బ్రీఫ్‌కేసును తీసుకొని లోపలికి వెళ్ళింది పద్మ.

భోజనాలయ్యాక వరండాలో వాలుకుర్చీలో కూర్చున్నాడు రఘు పద్మ తెచ్చి యిచ్చిన తాంబూలాన్ని తీసుకొంటూ. "అన్నట్లు పద్మా బావ హైద్రాబాద్ వెళ్ళి పదిరోజులవు. ఎప్పుడొస్తాడు?" అని అడిగాడు.

"వారంరోజుల్లో వస్తానన్నారు ఇవ్వాళో రేపో రావాలి." అంది పద్మ ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

"నీ వొక్కదానివే వున్నప్పుడు ఒంటరితనం ఫీలవుతున్నావు కదూ!" తాంబూలం నములుతూ అడిగాడు.

"ఆయన క్యాంపులకు, నేను ఒంటరితనానికి అలవాటు పడిపోయాం అన్నయ్యా! అయినా నాకు మాత్రం కాలక్షేపం బాగానే వుంటుంది. ఎందుకంటే మా పక్కింటివాళ్ళ అమ్మాయి అరుణ రోజూ వచ్చి కాస్సేపు సరదాగా కబుర్లుచెప్పి వెళ్తూంటుంది. ఒక్కొక్కసారి నేనే ఎగతాళిగా అంటూ వుంటాను, 'నాకుపిల్లల్లేరనేకొరత తీరుస్తున్నావు అరుణా' అని."

ఆ మాట అంటున్నప్పుడు పద్మ ముఖంలో కదలాడిన విషాద రేఖలు రఘుకు స్పష్టంగా కనిపించాయి. పిల్లలు కల్గలేదన్న దిగులు పద్మను మానసికంగా బలహీనురాల్ని చేస్తుందని రఘుకు తెలుసు. సాధ్యమైనంత వరకు పద్మను ఓదార్చటానికే ఎప్పుడూ ప్రయత్నించేవాడు రఘు.

"మన బ్రతుకులు గాలిలో దీపాల్లా వున్నాయమ్మా! ఎంత సంపద వుంటే మాత్రం మనిషికి లాభం ఏమిటి? మనశ్శాంతి లేకపోయాక — సమాజంలో ఓ స్టేటస్‌ను సంపాదించుకొని సుఖమయ జీవితాన్ని గడుపుతున్నప్పటికీ ఏదో అవ్యక్తమైన అశాంతి, అసంతృప్తి మనస్సును చికాకు పెడ్తూనే వున్నాయి... కన్న తండ్రికి చిన్నప్పుడే దూరమయ్యాం! కనీసం మాతృప్రేమనైనా పూర్తిగా చవిచూడలేకపోయాం!

మనం దురదృష్టవంతులం పద్మా !" బాధా పూరితమైన స్వరంతో పల్కాడు రఘు.

తల్లిమాట గుర్తుకు రాగానే పద్మకు దుఃఖం ఆగలేదు. మోకాళ్ళమీద తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. రఘు కళ్ళ నుండి అశ్రుబిందువులు రాలాయి.

"పిన్నీ." అన్న అరుణ పిలుపువిని కళ్ళు తుడ్చుకొంటూ ఎదురువెళ్ళింది పద్మ. ఆపిల్ల యిచ్చిన వారపత్రికను తీసుకొని లోపలపెట్టి వచ్చింది.

పద్మ బయటకు వచ్చేసరికి రఘు వరండాలో స్తంభానికి ఓ చేతిని ఆనించి శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

"కారు ప్రయాణం చేత అలసిపోయి వుంటావు ; హాల్లో ప్రక్కవేశాను కాస్సేపు పండుకో అన్నయ్యా !" అంది పద్మ.

రఘు హాలువైపు నడుస్తూ ఏదో స్ఫురణకు వచ్చి గిరుక్కున వెనక్కి తిరిగి పద్మ చేతులు పుచ్చుకొని "పద్మా ! నువ్వో సహాయంచెయాలి !" అన్నాడు.

"ఏంటన్నయ్యా ?"

"అమ్మరాసిన డైరీ కావాలి !" అన్నాడు.

"అన్నయ్యా ! దయచేసి ఆ ఒక్క కోరికను మాత్రం కోరవద్దని నీ కెన్నోసార్లు చెప్పాను "

"ప్లీజ్ పద్మా ! నా మాట విను."

"నీకు పుణ్యం వుంటుంది. దయచేసి నన్నడగకు." అంది ప్రతిమాలుతూ.

"పద్మా ! నీ ప్రవర్తన నాకు బాగుండలేదు అమ్మ రాసిన డైరీ చదివితే నాన్న గురించి వివరాలు తెలుస్తాయేమోనని నా ఆశ ; నీ కింత మొండి పట్టుదలేమిటి ?" కొంచెం కోపాన్ని ప్రదర్శించాడు రఘు.

"నన్ను క్షమించన్నయ్యా ! అమ్మ చనిపోయేముందు ఒట్టుపెట్టించుకొంది. తను రాసిన డైరీని ఎవ్వరికీ చూపించవద్దంది."

"పద్మ పట్టుపట్టినదంటే విడువదని రఘుకు తెల్సు ; చిన్నప్పట్నుంచి ఆమె తత్వం అంతే ; వయస్సుతోపాటు ఆ పట్టుదల, మొండితనం కూడా ఆమెలో పెరిగాయని సరిపెటుకొని చేసేదేమిలేక నిద్రకు ఉపక్రమించాడు రఘు.

పద్మకూడా వరండాలో వున్న వాలు కుర్చీలో నిద్రపోవటానికి ప్రయత్నించింది. కాని కళ్లు మూతలు పడటం లేదు ఆమె మనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది.

అమ్మ చనిపోయేముందు తన కిచ్చిన డైరీని తను యింతవరకు ఎప్పుడూ చదవలేదు చదవాలనే కోరికగాని, అవసరం కాని తనకు కల్గలేదు అందులో వున్న ప్రతి అక్షరంలోను అమ్మ ప్రతి రూపమే కన్పిస్తుందనే భయం చేతనే యింతకాలం తను ఆ డైరీని చదవలేక పోయింది. ఆ డైరీని యివ్వమని తన అన్న ఎన్నోసార్లు అడిగాడు. తల్లికిచ్చిన మాటకు కట్టుబడి తను నిరాకరించింది. దాన్లో తెల్సుకోవాల్సిన విషయాలు ఎన్నో వుండి వుంటాయి. లేకపోతే తన అన్న తన నంత ప్రాధేయ పడేవాడు కాదు.

పద్మ మనస్సు ఎన్నో విధాల ఆలోచించింది. ఆ డైరీలోని విషయాలను చదవమని మనస్సు ఒత్తిడి చేయసాగింది.

ప్రయాణం చేసిన బడలికచేత రఘు మైమరచి నిద్ర పోతున్నాడు.

పద్మ నిదానంగా వెళ్ళి బీరువా తెరచి డైరీని బయటకుతీసింది. చదవటం మొదలు పెట్టింది.

పేజీలు త్రిప్పుతున్న కొద్దీ ఆమె కళ్ళ వెంట నీళ్ళు జల జలా కారసాగాయి ఇక ఒక్క పేజకూడా చదవలేక పోయింది

ఆ డైరీని మళ్ళీ బీరువాలో పెట్టేసి

భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్ళి వాలు కుర్చీలో వాలి పోయింది.

పైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్‌లా, డైరీలో చదివిన విషయాలు పద్మ మనస్సులో ఒకదాని వెనుక మరొకటి గిర్రున తిరిగాయి.

తన తల్లి దేవత! ఆవిడ హృదయ నైర్మల్యం తను చదివిన డైరీలో ప్రతి అక్షరంలోను కన్పిస్తూంది! పవిత్రురాలైన తన తల్లిమీద లోకులు తీరని అపవాదును వేశారు. ఆ అపవాదును తన తండ్రికూడా నమ్మేశాడు. కేవలం ఒక ఆడదాని మోజులో పడి అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్యనే శంకించి కన్నబిడ్డల జీవితాలను నరకమయం చేసిన కఠినాత్ముడు తన తండ్రి! ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడు తన తల్లిని. తన తల్లి టీచర్ వుద్యోగం చేస్తానంటే మొదట్లో అభ్యంతరం పెట్టాడట. కాని ఆర్థికలేమి చేత యిద్దరూ వుద్యోగాలు చెయ్యాల్సి వచ్చినదట! ఐదు సంవత్సరాల పాటు తమ జీవితంలో ఎటువంటి ఒడుదుడుకులు లేదని రాసింది అమ్మ. ప్రక్కింటి విశాలక్షి మోజులో పడిన దగ్గర్నుంచే నాన్న ప్రవర్తన మారిపోయింది. విశాలక్షి నాన్న మనస్సును మార్చేసింది. తన తల్లిమీద లేనిపోని అభాండాలను వేసి ఆయన మనస్సులోని ప్రేమను ధ్వంసం చేసింది. పైగా సోదరుని లాంటి ప్రసాద్ గారికి అమ్మకు అక్రమ సంబంధాన్ని అంటగట్టి దుష్ప్రచారం చేసింది. ప్రసాద్‌గారిని గురించి అమ్మ డైరీలో వ్రాసింది.

"ప్రసాద్‌గారు తన తోటి ఉపాధ్యాయుడు. ఎంతో మంచివాడు. నాకు సోదరుడులేని కొరత తీర్చినవాడు. నా శ్రేయోభిలాషి!" అని ఎన్నోసార్లు ఆయన మంచి తనాన్ని గురించి అమ్మ డైరీలో రాసుకొంది. కాని అలాంటి స్నేహాన్ని తన తండ్రి ఎందుకు అపార్థం చేసుకొన్నాడో తను వుహించలేకుండా వుంది. తన తల్లి రాసిన దాన్నిబట్టి చూస్తే దీపావళి మర్నాడు జరిగిన సంభాషణే కారణ మన్పిస్తూంది.

"నేను వెళ్ళిపోతున్నాను లలితా! నిన్ను వదిలి పోవాలంటే ఏదో పోగొట్టుకొంటున్నట్టుంది. ఈ ట్రాన్స్‌ఫర్‌ను ఆపుచేసుకోటానికి అన్ని విధాల ప్రయత్నించి విఫలుడనయ్యాను ఉత్తరాలు రాస్తూండు. పిల్లలు జాగ్రత్త! వస్తా!" అని చెప్పి వెళ్ళిపోయిన ప్రసాద్‌గారు బహుశా చాటునే వున్న నాన్నను చూసివుండరు. ఆ మాటల్ని అపార్థంచేసుకొని నాన్న ప్రసాద్ గారిమీద పగబట్టి వుంటాడు ఆ తర్వాత జరిగిన విషయాలు ఎవరో చెప్తుండగా విన్నది తను! నాన్న ప్రసాద్‌గార్ని చంపబోయాడని ఆయన మెదడుకు బాగా దెబ్బ తగిలి పిచ్చివాడయ్యాడని, నాన్నపై హత్యానేరం ఆరోపించబడి జైలుశిక్ష పడిందన్న విషయాలు కాలక్రమేణా బయటపడ్డాయి. తల్లి ఉద్యోగం ఆధారంతోనే తను అన్నయ్య పెరిగి పెద్దవాళ్ళయ్యారు భర్త ఎడబాటును కడుపులోనే దిగమింగుకొని అన్నయ్యను ఇంజనీరింగ్ చదివించింది తన తల్లి. పిల్లలు ప్రయోజకులైనందుకు ఆనందించే అదృష్టం లేకపోయింది తన తల్లికి. కాన్సర్ వ్యాధితో బాధపడి తన పెళ్ళి కాకముందే అసువులను కోల్పోయింది.

పద్మ కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

మెల్లగా లేచివెళ్ళి గుమ్మంపైనె వ్రేలాడుతున్న తల్లి ఫొటోవైపు సజలనేత్రాలతో చూస్తుండిపోయింది.

*

"ఇక నువ్వు యింటికి పోవచ్చు రంగయ్యా!" డాక్టర్ పిలుపు విని ఏదో

ఆలోచిస్తున్న రంగయ్య పులిక్కిపడి లేచి నిలబడ్డాడు

"మీ మేలు మరువలేను బాబూ! నేను పేదవాణ్ని! మీ ఋణాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియటంలేదు డాక్టరుగారూ!"

"నాదేముందయ్యా! నీకైన ఖర్చంతా ఆ రఘునాథరావుగారే యిచ్చారు. నువ్వు నిజంగా ఋణపడిందినాక్కాదు ఆయనకే!" అన్నాడు డాక్టర్.

రఘుబాబు నిజంగా దేవుడండీ. ఆయన్ని ఒక్కసారి కల్సుకోవాలని వుంది. ఆయన ఎక్కడ వుండేది మీకు తెలుసా?" ఎంతో ఆశగా అడిగాడు రంగయ్య.

డాక్టర్ రెండు క్షణాలు ఆలోచించి "ఆల్ రైట్! ఆయన అడ్రసు యిస్తాను!" అని టేబుల్ దగ్గరగా వెళ్ళి రఘు యిచ్చిన అడ్రసు కార్డును రంగయ్యకు యిచ్చాడు.

డాక్టర్ దగ్గర సెలవు పుచ్చుకొని రఘు దగ్గరకు బయల్దేరాడు రంగయ్య. రంగయ్య వెళ్ళేసరికి రఘు, పద్మ వరండాలో కాఫీ త్రాగుతూ కూర్చున్నారు.

"నమస్కారం బాబూ!" అన్న పిలుపు విని రఘు రంగయ్య వైపు చూశాడు.

"రా! రంగయ్యా! రా! ఇప్పుడే నీ దగ్గరకు వద్దామనుకొన్నాను! కాని యింతలో నువ్వే వచ్చేశావు! రిలీవ్ చేశారా?"

డాక్టర్‌గారు యివ్వాళ వెళ్ళిపొమ్మన్నారండి! నాకైన ఖర్చంతా మీరే యిచ్చారని డాక్టర్‌గారు చెప్పారు. మీ మేలు మర్చిపోలేను బాబూ!" రెండు చేతులూ జోడించాడు రంగయ్య కృతజ్ఞతతో.

"దానిదేముంది రంగయ్యా! నిన్నా పరిస్థితిలో వదిలిపెట్టి రావటానికి ఏ మానవ హృదయం ఒప్పుకుంటుంది చెప్పు. అన్నట్టు నిలబడే వున్నావే? అలా కూర్చో!" అని కుర్చీ చూపించాడు.

"ఫర్వాలేదు బాబూ!" అన్నాడు రంగయ్య మొహమాటంగా.

"కాదు ముందు అలా కూర్చో!" అన్నాడు రఘు.

రంగయ్యకు ఏం చేయాలో తోచక నేల మీదే కూర్చోబోయాడు. కాని రఘు అందుకు ఒప్పుకోలేదు.

"అలా కుర్చీలో కూర్చోరంగయ్యా! ఎందుకు బిడియపడ్తావ్!"

"మీరు శ్రీమంతులు! అలాంటి కుర్చీల్లో కూర్చునే అర్హత మాలాంటి వాళ్ళకు లేదు బాబూ!" అన్నాడు రంగయ్య ఏదో చూస్తూ.

"అర్హత అనేది ఎదుటివాడిచ్చే గౌరవ మ్మీద ఆధారపడి వుంటుంది కాని ఆస్తులు, అంతస్తులమీద ఆధారపడదు రంగయ్యా! కమాన్ అలా కూర్చో!" అని రఘు అనే సరికి ఎదురుచెప్పలేక రంగయ్య కుర్చీలో కూర్చున్నాడు.

నేను చెప్పిన రంగయ్య ఇతనే నమ్మా!" అని పద్మకుచెప్పి రంగయ్య వైపు తిరిగి "ఈమె మా చెల్లాయి పద్మ. ఈ ఇల్లు వీళ్ళదే! మా బావగారు ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు." అని పరిచయం చేశాడు.

"నమస్కారం తల్లీ!" అన్నాడు రంగయ్య.

పద్మ రంగయ్య కళ్ళల్లోకి చూస్తూ" నీకు భార్యాబిడ్డలు లేరా?" అని అడిగింది.

రంగయ్య ముఖం మరింత దీనంగా మారి పోయింది

"అందరూ వున్నప్పటికీ ఎవ్వరూలేని నిర్భాగ్యుణ్ణి తల్లీ! అంతా స్వయంకృతం! పూర్వజన్మలో చేసుకొన్న పాపాల ఫలితాన్ని ఈ జన్మలో అనుభవించాలంటారు. కాని అంతా అబద్ధం అమ్మా! ఈ జన్మలో చేసిన పాపాలను ఈ జన్మలోనే అనుభవించి తీరాలి. అది నేను తెల్సుకొన్న గుణపాఠం."

"పాపాలు చేశామని తెల్సుకొని పశ్చా

త్తాప పడటంతోనే కొంత ప్రాయశ్చిత్తం కల్గుతుంది. కాని ఈ నాటి మానవులు ఆ స్వల్ప విషయాన్ని కూడా తెల్సుకోలేరు" అన్నాడు రఘు

"అన్నయ్యా! రంగయ్యకూడా కాఫీ తెస్తాను" అంటూ యింట్లోకి వెళ్ళింది పద్మ.

"ఇప్పుడొద్దమ్మా!" అన్న రంగయ్య పలుకులను విన్పించుకోలేదు. లోపలికి వెళ్తున్న పద్మవైపు తదేకంగా చూస్తూండిపోయాడు రంగయ్య.

రఘు తనవైపే చూస్తున్నాడని గ్రహించి నా కూతురు కూడా యీ పాటికి యింత పెరిగి వుంటుంది బాబూ!" అన్నాడు.

"అయితే వాళ్ళెక్కడ వున్నారో నీకు తెలీదా?" అని అడిగాడు.

"లేదు బాబూ! వాళ్ళకు దూరమై ఎన్నో సంవత్సరాలయింది. నా పిల్లలు ఎక్కడున్నదీ, వాళ్ళ తల్లి ఎలాంటి అగచాట్లు పడుతున్నదీ నాకు తెలియలేదు నా మూర్ఖత్వం చేత తొందరపాటు చేత భార్యను అనుమానించే ఈ స్థితికి వచ్చాను. పగవాడికూడా నా లాంటి నిర్భాగ్యుని బ్రతుకు కల్గకూడదని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను!" అన్నాడు రంగయ్య.

"అయితే యిలాంటి దుస్థితిని, ఆవేదనను కల్గించేటంత తప్పు ఏం చేశావు నువ్వు?"

"చేసిన తప్పులు చెప్పుకొంటే పోతాయంటారు కాని నేను చేసిన నేరం చెప్పుకొంటే పోయేదికాదు బాబూ! అందంతా చెప్పి మీ ముందు దోషిగా నిలబడలేను. నా మీద మీకున్న సానుభూతిని పోగొట్టుకోవటం నాకిష్టం లేదు"

అంతలో పద్మ కాఫీ కప్పు తీసుకు వచ్చి రంగయ్యకు అందించింది.

కాఫీ త్రాగుతున్న రంగయ్యకు ఎదురుగా గుమ్మంపైన వ్రేలాడుతున్న ఫొటో కన్పించింది

అంతే!

చేతిలో వున్న కప్పు జారిపోయింది.

కాఫీ నేలపాలైంది.

రంగయ్య కంగారుపడు లేచి నిలబడ్డాడు.

"క్షమించండి బాబూ! కప్పు చెయ్యిజారిపోయింది" అంటూ పగిలిన కప్పుముక్కల్ని ఏరసాగాడు.

"ఫర్వాలేదులే .... వాటిని అలా వుంచు, మా పనిపిల్ల తీస్తుందిలే!" అంది పద్మ

రంగయ్య అంతగా కంగారుపడటానికి కారణం రఘుకు అంతుబట్టలేదు.

"ఆ ఫోటోలో వున్నవారు ..."

"మా అమ్మగారే" అంది పద్మ.

"అయితే మీ నాన్నగారి ఫోటో...."

"ఫోటోలు పెట్టించుకొని పూజలు చేయించుకొనే అదృష్టం అందరికీ వుండదు రంగయ్యా!"

రంగయ్య క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు.

"నాన్నగారంటే పద్మకు కోపం లే రంగయ్యా! మమ్మల్ని చిన్నప్పుడే తల్లి దగ్గర వదిలేసి దేశాల వెంట వెళ్ళారు" అన్నాడు రఘు.

"నిజమేనమ్మా! అలాంటివారికి పెదరికం యివ్వటంకూడా తప్పే! మీ అమ్మ దేవత!"

"నీ కెలా తెల్సు?"

"మాది కూడా మీ వూరే! మీ తల్లిదండ్రులు నాకు బాగా తెల్సు! మీ నాన్న మీకు చాలా అన్యాయంచేశాడు అమాయకురాలైన మీ తల్లి జీవితాన్ని నాశనం చేశాడు. అయినా ఆ మహాతల్లి ధైర్యంగా నిలబడి పిల్లల్ని పెంచి పెద్దచేసింది నా కెంతో ఆనందంగా వుందమ్మా! నువ్వు ఏం చేస్తున్నావు బాబూ!" అని అడిగాడు రఘువైపు తిరిగి.

"అసిస్టెంటు యింజనీరుగా పని చేస్తున్నాను."

"చాలా సంతోషం బాబూ! దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి [illegible] పిల్లలు చల్లగా వుండాలి! వస్తా! వస్తానమ్మా!" అంటూ రంగయ్య ఒక్క క్షణం

కూడా నిలబడకుండా ఆ ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు.

రంగయ్య వింత ప్రవర్తనకు కారణమేమిటో మర్నాటికి గాని అర్థంకాలేదు రఘుకు, పద్మకు.

మర్నాడు పోసులో వచ్చిన ఉత్తరంలోని సారాంశం అన్నాచెల్లెళ్ళను ఎంతో కలవరపర్చింది.

చిరంజీవులైన పద్మ, రఘులకు,

ఆశీస్సులు ; మానవుడు కాలానికి దాసుడు విధి చేతులో కీలు బొమ్మ. కొన్ని సందర్భాలలో ఈ మానవుడు నిర్విణ్ణుడు, నిస్సహాయుడై పోతాడు. నుదుట రాసిన రాతను చెరపటం బ్రహ్మతరంకూడా కాదు మానవ ప్రతిమకు బంగారు పూత పూస్తే భాగ్యవంతుని గాను బూడిద పూత పూస్తే పేదవాని గాను పుడతాడనేది అసత్యం. ఈ విశ్వమంతా కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి ముందుకు సాగిపోతూంది. ఒకప్పుడు గొప్ప దశలో వుండి నల్గురి చేత సేవలు చేయించుకొన్న వాడికి మరొకప్పుడు నల్గురికీ సేవలు చేయాల్సిన దుర్గతి కూడా పట్టుంది. అందుకు ఉదాహరణ నా జీవితమే ! నా భార్యవుండగా నాకు ఏలోటూ లేకుండా సంసారం సాఫీగా సాగిపోయింది. మా యిద్దరి సంపాదనతో ఎన్నో రోజులు హాయిగా గడిచి పోయాయి. కాని హఠాత్తుగా నాలో దుర్బుద్ధి ప్రవేశించి చివరకు నన్ను అందరికీ దూరం చేసి ఓ రిక్షావానిగా మార్చివేసింది. అందుక్కూడా నేను బాధ పడటంలేదు, కాని నిష్కళంకమైన యిల్లాలును అనుమానించి అవస్థల పాలు చేసినందుకు ఎంతో కుమిలి పోతున్నాను. నా మూలాంగానే నా భార్య ఆకస్మిక మరణాన్ని పొందినదన్న సత్యం, నా హృదయాన్ని చిత్రహింస చేస్తూంది. నా స్వంత బిడ్డల చేత "నాన్నా !" అని ఆప్యాయంగా పిలిపించుకోలేని నిర్భాగ్యుణ్ణి నేను ; కాని నాకు ఒకందుకు సంతోషం వుంది. అనుకోకుండా ఆ దేవుని దయ వలన నా బిడ్డల్ని చూడగల్గాను. వాళ్ళలో వున్న మమత, మానవతలు నాకు గర్వకారణా లయ్యాయి. ముఖాముఖిగా నేనే మీ తండ్రిని " అని చెప్పుకోలేని దురదృష్టవంతుణ్ణి ! అమ్మా పద్మా నాయనా రఘూ ! ఉత్తరం ద్వారా కూడా మీ తండ్రిని నేనేనని చెప్పుకోలేక పోతున్నాను.

ఆ దేవుడు కరుణామయుడు, నా ప్రార్థనను మన్నించి కడసారి మిమ్మల్ని నాకు చూపించాడు. నేను చేసిన పాపాలకు ఫలితంగా జైలుశిక్షను అనుభవించాను. జైలు నుండి విడుదలయ్యాక మన వూరువెళ్ళి మీ గురించి వివరించాను. నా లలిత కన్పిస్తుందేమోనని ఎన్నో వూళ్ళు తిరిగాను. కాని ఫలితం లేకపోయింది. నిరాశతో మరీ కృంగిపోయాను కడుపునింపుకోడానికి గత్యంతరములేక రిక్షావానిగా జీవించాల్సి వచ్చింది. కాని నా బిడ్డల్ని చేరటానికి ఆ వృత్తే కారణమవుతుందని కలలో కూడా వూహించలేదు. మీరిద్దరూ బాగా అభివృద్ధిలోకి వచ్చారు. సంఘంలో పేరు ప్రతిష్ఠలను సంపాదించుకొని గౌరవనీయమైన స్థానమేర్పరచుకొన్నారు. అటువంటి మీ జీవితాల్లో మాయని మచ్చలా నేను ప్రవేశించి సంఘంలో మీకు తలవంపులు తేలేను మీరు నన్ను ముందుగా అసహ్యించుకొన్న తర్వాత ఆదరిస్తారనే నమ్మకం నాకుంది. కాని మీ జీవితాల్లో నేను ప్రవేశించటం చేత సంఘంలో మీకు సమస్యలు ఎదురౌతాయి. మీ సుఖం కంటె నాకు కావల్సిందేమీ లేదు. నా పిల్లలిద్దరూ అమృత హృదయులు, ఆ తృప్తితోనే నేను ఆఖరి శ్వాసవదుల్తాను నా కోసం నిరీక్షించకండి. ఆశీర్వచనములతో,

మీ తండ్రినని చెప్పుకోలేని నిర్భాగ్యుడు,
రంగారావు.

సజలనేత్రాలతో ఉత్తరాన్ని మరొసారి చదువుకొన్నాడు రఘు. ★